'తెంటు' పదవీ కాలం మరో ఏడాది పొడిగింపు

బొబ్బిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) చైర్మన్‌గా ఉన్న తెంటు లక్ష్మునాయుడు పదవీకాలాన్ని మరో సంవత్సరం పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. బుడాచైర్మన్‌గా తెంటును 2024 నవంబరు 12న నియమించిన సంగతి తెలిసిందే, ఆ జీఓ ప్రకారం చైర్మన్ పదవీకాలం ఒక సంవత్సరం మాత్రమే ఉండడంతో తాజాగా పొడిగిస్తూ మరో జీవో ఇచ్చారు.



పూజలందుకుంటున్న సిరిమాను చెట్టు

ఉత్సవాల కోసం..

పైడిమాంబ సిరిమాను ఉత్సవాలకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రోడ్లపైన గుంతలను పూడ్చారు. ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ తీగెలను కూడా సరిచేస్తున్నారు. ఇంకోవైపు సిరిమానోత్సవానికి సంబంధించి మాను తయారు చేసే పనులు చకచకా సాగుతున్నాయి. అదే సమయంలో సిరిమాను వద్ద మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. ఇదిలా ఉండగా చదురుగుడిలో మంగళవారం పైడిమాంబకు ప్రత్యేక నివేదన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకూ దర్శనాలు నిలిపివేయనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

6 లో


వైభవంగా అక్షరాభ్యాసాలు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచి సామూహిక అక్షరాభ్యాసాలు వైభవంగా జరిగాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా పిల్లలను తీసుకుని వచ్చారు. అర్చకుడు ఫణిహారం తాతాచార్యులు తొలుత శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదా సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం, మంచినీరు, పిల్లలకు పాలు అందించారు. కార్యక్రమంలో జి.శివకుమార్, చెరుకూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాన సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు

క్వారీల నిర్వహణలో ఇష్టారాజ్యం



జిల్లాలో క్వారీల నిర్వహణలో నిబంధనలు పాటించడం లేదు. అనుమతులకు మించి రాతి తవ్వకాలు చేపడుతున్నారు. భారీ యంత్రాలు, అభ్యంతకర స్థాయిలో బాంబులు వాడుతూ కొండలను దోపిడీ చేస్తున్నారు. వీటి నిర్వహణలో లోపాల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న చుట్టుపక్కల గ్రామాల వారు అధికారులకు, నేతలకు ఫిర్యాదులు, విన్నపాలు ఇస్తున్నా పరిగణనలోకి తీసుకోవడం లేదు. తెరవెనుక క్వారీల నిర్వాహకులకు అధికారులు సహకారం అందిస్తున్నట్లు ప్రజల్లో అనుమానాలున్నాయి.

- అనుమతికి మించి తవ్వకాలు
- నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాల వినియోగం
- సమీప గ్రామాల ప్రజల్లో వణుకు
- ఫిర్యాదులు ఇస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఏదైనా ఘటన జరిగినప్పుడే హడావుడి

రాజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్వారీల ఏర్పాటుకు ముందు నిర్వాహకులు చెప్పే మాటలేవీ ఆచరణలో ఉండడం లేదు. భరోసా ఇచ్చిన అధికారులు నిఘా పెట్టడం లేదు. సమీపంలో గ్రామాలు ఉన్నా.. ప్రజలు నివశిస్తున్నా.. ప్రకృతి వనరులు విధ్వంసానికి గురవుతున్నా.. వన్యప్రాణులకు ముప్పువాటిల్లుతున్నా.. చివరకు మనుషుల ప్రాణాలు పోతున్నా పట్టించుకునేవారు కరువవుతున్నారు. నిర్వాహకులకు అనధికారికంగా పేలుడు పదార్థాలు విక్రయిస్తున్న వ్యాపారులపైనా ఎటువంటి చర్యలు లేకుండా పోతున్నాయి. జిల్లాలో గనుల శాఖ పరిధిలో దాదాపు 200 క్వారీలు ఉన్నాయి. 98 క్రషర్లు కొనసాగుతున్నాయి. ఎక్కువగా ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో క్వారీలు అధికం. రాజాం నియోజకవర్గానికి సంబంధించి (మిగతా 8వ పేజీలో..)



రాజాం -పాలకొండ ప్రధాన రహదారికి సమీపంలో గ్రానైట్ క్వారీ

పర్యవేక్షణ కరువు..

క్వారీల నిర్వహణ, క్రషర్లపై అధికారుల కనీస పర్యవేక్షణ కరువవుతోంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేయడం.. తరువాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. వాస్తవానికి నిర్ణీత సమయంలో విధిగా క్వారీలను తనిఖీలు చేయాలి. గనులు, పోలీస్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ, భద్రత, అగ్నిమాపక శాఖలు క్వారీలను నిత్యం పర్యవేక్షిస్తుండాలి. తనిఖీలు చేపట్టి నిబంధనల ప్రకారం నడుపుతున్నారా? లేదా? అన్నది పరిశీలించాలి. లేకుంటే చర్యలకు ఉపక్రమించాలి. కేసులు నమోదుచేయాలి. కానీ ఏదైనా ఘటన జరిగినప్పుడు ఉరుకులు పరుగులు పెట్టడం.. తరువాత దాని గురించి మరిచిపోవడం జరుగుతోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం క్వారీల నిర్వహణపై దృష్టిసారించాల్సి అవసరం ఉంది.

దత్తికి సీఎం రావడం ఆనందదాయకం


- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కొండపల్లి



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఆధారపడే రైతులు అధికంగా ఉన్న దత్తి గ్రామానికి ముఖ్యమంత్రి రావడం ఆనందించదగ్గ విషయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దత్తి గ్రామానికి బుధవారం సీఎం రానుండడంతో పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు మంత్రి సోమవారం గ్రామాన్ని సందర్శించారు. హెలిపాడ్ నుంచి ప్రజావేదిక వద్దకు, పింఛనుదారుల గృహాల వద్దకు ముఖ్యమంత్రి వెళ్లే మార్గాన్ని, రాజకీయ ప్రతినిధుల సమావేశానికి ఏర్పాటు చేసిన హాల్‌ను, ముఖ్యమంత్రి విశ్రాంతి కోసం ఏర్పాటు చేస్తున్న గ్రీన్ రూమ్‌ను కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మొదటి సారిగా విజయనగరం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు వస్తున్నారని, ఈ పర్యటన తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలోని దత్తి గ్రామంలో జరుగుతుండడం సంతోషించాల్సిన విషయం అన్నారు. దత్తి గ్రామ అభివృద్ధి, ప్రజల కష్టసుఖాలను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకుంటారని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన నిర్వహిస్తున్న పేదల దినోత్సవంలో (మిగతా 8వ పేజీలో..)

ముఖ్యమంత్రి పర్యటన ఇలా...



బొబ్బిలి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల 1న జిల్లాలో పర్యటించనున్న విషయం తెలిసిందే. పర్యటన షెడ్యూల్‌ను అధికారులు సోమవారం విడుదల చేశారు. 1న ఉదయం 11 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.20 గంటలకు విశాఖ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి గజపతినగరం నియోజకవర్గం దత్తి గ్రామానికి 11.30 గంటలకు చేరుకుంటారు. 11.50 గంటలకు గ్రామంలోని ప్రజావేదిక వద్దకు వెళ్తారు. మధ్యాహ్నం 1.20 గంటల వరకు మీటింగ్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.55 గంటల నుంచి 2.10 గంటల వరకు దత్తి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. 2.10 నుంచి 2.35 గంటల వరకు లబ్ధిదారులతో ముఖాముఖిలో పాల్గొంటారు. 2.40 గంటలకు దత్తిలో జరిగే పార్టీ శ్రేణుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల వరకు పార్టీ శ్రేణులతోనే ఉంటారు. 4.05 గంటలకు హెలిపాడ్ వద్దకు చేరుకొని హెలికాప్టర్‌లో బయలుదేరి తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసానికి సీఎం చేరుకుంటారని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

ఎస్పీ ఏఆర్ దామోదర్



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శారీరక వ్యాయామంతో గుండె జబ్బులు దూరం అవుతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ప్రపంచ హార్ట్ డే సందర్భంగా కోట జంక్షన్ నుంచి తిరుమల ఆసుపత్రి వరకూ సోమవారం చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మనం ఆరోగ్యంగా ఉంటే కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మనం ప్రాణాలతో జీవించాలంటే మన గుండె పదిలంగా ఉండాలని, ఎటువంటి గుండె జబ్బులు లేకుండా ఆరోగ్యవంతంగా జీవించాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడిని దూరం చేసుకుంటూ ప్రతిరోజు వ్యాయామం, యోగా చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం అవుతుందని, సమాజంలోనూ.. కుటుంబంలోనూ గౌరవం కోల్పోతారన్నారు.

యువత మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ లక్ష్యంపై దృష్టి పెట్టి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమల ఆసుపత్రి ఎండీ డాక్టర్ తిరుమల ప్రసాద్, మాన్సాస్ ఈవో కెవీఎల్‌పీ రాజు, కార్డియాలజిస్ట్ డాక్టరు శరత్‌చంద్ర, డాక్టరు దుర్గాప్రసాద్, డాక్టరు కిరణ్, మల్లికార్జున రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.





గుండెపోటుతో ఎస్ఐ మృతి

పూసపాటిరేగ,సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో విజయదశమి విధులు నిర్వహించేందుకు వెళ్లిన పూసపాటిరేగ రెండో ఎస్ఐ శ్రీనివాసరావు తాను విశ్రాంతి తీసుకుంటున్న లాడ్జిలో సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. స్నానపు గదిలో ఉన్నచోటే కూలిపోయారు. ఈయన కొంతకాలంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం అనకాపల్లి. ఈయనకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ మృతి వార్త తెలిసి స్థానిక ఒకటో ఎస్ఐ దుర్గాప్రసాద్, స్టేషన్ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆయన మృతదేహానికి విజయవాడ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించి స్వగ్రామానికి తీసుకెళ్లారని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.



ఎస్ఐ శ్రీనివాసరావు(ఫైల్)

బీమాతో ధీమా



- ఆరు కొత్త పథకాలను ప్రవేశపెట్టిన తపాలాశాఖ
- గ్రామీణ ప్రజలకు మరింత ప్రయోజనం
- తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్‌కు అవకాశం

గజపతినగరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ఆరు రకాల బీమా పథకాలను కొత్తగా తీసుకొచ్చింది. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్‌లతో పాలసీదారులకు భరోసా ఇస్తోంది. సురక్ష, సువిధ, సుమంగళ్, సంతోష్, గ్రామప్రియ, చిల్డ్రన్ పాలసీ పేర్లతో ఆరు పథకాలను ప్రవేశపెట్టింది. ఒక్కో పథకం ద్వారా రూ.10వేల నుంచి రూ.10 లక్షల వరకు పాలసీ తీసుకునే అవకాశం కల్పించింది. లబ్ధిదారుడు మూడేళ్లపాటు జరిపిన చెల్లింపులపై రుణ సదుపాయం కూడా కల్పించనుంది. ప్రీమియం చెల్లిస్తున్న సమయంలో పాలసీదారుడు మృతిచెందితే చెల్లించిన పాలసీ మొత్తాన్ని ఒకేసారి నామినీకి అందజేస్తారు. ఈపథకాల్లో చేరదలిచిన వారికి ఆధార్‌తో పాటు పాన్‌కార్డు ఉండాలి. జిల్లాలో ఏపోస్టాఫీసులో అయినా ప్రీమియం చెల్లించవచ్చు. ఆదాయపు పన్ను రాయితీ, నామినేషన్ సదుపాయం, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే అవకాశాన్ని తపాలశాఖ కల్పించింది. గతంలో పాలసీదారులపై జీఎస్టీ ప్రభావం ఉండేది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో జీఎస్టీ లేకుండా ప్రీమియం కట్టుకోవచ్చు.

సంతోష్ పాలసీ ఇలా..

సంతోష్ పథకం కింద రూ.10వేల నుంచి రూ.10లక్షల వరకు పాలసీ తీసుకోవచ్చు. 19నుంచి 55మధ్య వయస్కులు అర్హులు. బోనస్ కింద రూ.1000కి రూ.48 వర్తిస్తుంది. 19ఏళ్ల వ్యక్తి ఈ పథకంలో చేరితే (మిగతా 8వ పేజీలో..)

సరస్వతీదేవిగా దుర్గమ్మ

దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని సోమవారం సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్నిచోట్ల దుర్గమ్మ సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లను భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకొని..ప్రత్యేక పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



పాలకొండ: నక్కలపేటలోని జ్ఞానసరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు



సాలూరు: సరస్వతీదేవి అలంకరణలో కామాక్షి అమ్మవారు



దుర్గమ్మకు 20 రకాల నైవేద్యం

నెల్లిమర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిలో శ్రీదుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సోమవారం భక్తితో సారె సమర్పించారు. ఉత్సవాల నిర్వాహకులు, భక్తులు దుర్గమ్మకు 20 రకాల సీట్లు, 5 రకాల పిండివంటలు, పది రకాల ఫలాలు నైవేద్యంగా పెట్టారు. ఈ సందర్భంగా భవానీ మాలధారులు అమ్మవారి సన్నిధిలో భజనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఎస్.కోట రూరల్: దుర్గాదేవి ఆలయంలో అక్షరాభ్యాసాలు..



బొబ్బిలి: సరస్వతీదేవిగా దాడితల్లి అమ్మవారు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారు..



బొబ్బిలి: బ్యాంకర్స్ కాలనీలో..



బొబ్బిలి రూరల్: కృష్ణాపురం గ్రామంలో సామూహిక అక్షరాభ్యాసాలు



భామిని: బత్తిలిలో సామూహిక పూజలు

ఘనంగా వెంకన్న తిరువీధి

నెల్లిమర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి తిరువీధి మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి శ్రీరామ స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. అనంతరం స్వామి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు



వీరఘట్టం: కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు

పైడితల్లి ఉత్సవాల కోసం..

- వివిధ శాఖల అధికారుల ఏర్పాట్లు
- విద్యుత్ స్తంభాల మార్పు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమాను ఉత్సవాలకు ఆటంకం లేకుండా వివిధ మార్గాల్లో ప్రభుత్వ శాఖల అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. ఇప్పటికే నగర పాలక సంస్థ పరిధిలో రోడ్లపైన గుంతలను పూడ్చారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసమైన హుకుంపేట నుంచి సిరిమానును మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి వద్దకు తీసుకురానున్నారు. ఆ రోడ్లలో ఎటువంటి అటంకాలు లేకుండా విద్యుత్ శాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. హుకుంపేట, ఉల్లివీధి, కన్యకా పరమేశ్వరి ఆలయం, గంటస్తంభం రోడ్డు వరకూ ఉన్న ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. హుకుంపేట నుంచి గంట స్తంభం వరకూ ఉన్న 24 విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో 9.1 మీటర్ల ఎత్తులో ఉన్న కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మూడులాంతర్లు నుంచి కోట వరకూ ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగెలను కూడా సరిచేస్తున్నారు. హుకుంపేట నుంచి ఉల్లివీధి, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంట స్తంభం వరకూ విద్యుత్ స్తంభాల మార్పు కోసం రూ మూడున్నర లక్షలు వెచ్చిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ పనులను డీ-1 సెక్షన్ ఏఈ అప్పారావు పర్యవేక్షిస్తున్నారు. పైడిమాంబ సిరిమాను సంబరాలు, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో నగరంలో విద్యుత్ పరంగా ఎలాంటి అటంకాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని డీఈఈ త్రినాథరావు చెప్పారు.

సిరిమానుకు భక్తుల పూజలు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవానికి సంబంధించి మాను తయారు చేసే పనులు చకచకా సాగుతున్నాయి. అదే సమయంలో సిరిమాను వద్ద మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. సిరిమానుపై బిందెలతో నీళ్లు చల్లి పైడిమాంబకు చల్లదనం చేస్తున్నారు. మరికొంత మంది సిరిమానుకు క్షీరాభిషేకం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సిరిమాను పనులకు ఆటంకం లేకుండా.. తయారుచేసే విధానంపై అవగాహన కల్పించేందుకు నిపుణులు కూడా ఉన్నారు. పోలీసు బందోబస్తుతో పాటు అటవీశాఖాధికారులు కూడా సిరిమాను తయారు చేసే ప్రాంతంలోనే పర్యవేక్షణ చేస్తున్నారు.



హుకుంపేట రోడ్డులో స్తంభాలు మారుస్తున్న దృశ్యం



ఆదాయ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

పైడిమాంబ హుండీల లెక్కింపు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ చదురుగుడి హుండీలను సోమవారం శివాలయం వద్ద ఉన్న కల్యాణ మండపంలో లెక్కించారు. రూ.16 లక్షల 75 వేల 917 నగదు, 14.100 గ్రాముల బంగారం, 301 గ్రాముల వెండి వచ్చింది. అన్నదానం కోసం రూ.800 నగదు వచ్చినట్టు దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష చెప్పారు. ఏసీతో పాటు ఆలయ సూపరింటెండెంట్ రమణి పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఇదిలా ఉండగా.. స్థానిక మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో మంగళవారం పైడిమాంబకు ప్రత్యేక నివేదన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకూ దర్శనాలు నిలిపివేయనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

సిరిమాను వద్ద పూజలు చేస్తున్న మహిళలు





దిగువకు విడుదల చేసిన వరద ప్రవాహం

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంటోంది. భారీ వర్షాల కారణంగా పైప్రాంతాల నుంచి వరద ప్రవాహం చేరుతోంది. సోమవారం నదిలోకి 6 వేల క్యూసెక్కుల మేర వరద చేరింది. స్పిల్‌వే గేట్ల నుంచి దిగువ ప్రాంతాలకు 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.28 మీటర్ల నీటి నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసిన పక్షంలో వరద ప్రవాహం అధికమయ్యే పరిస్థితి ఉంది. దిగువ ప్రాంతాలకు వరద ప్రవాహం విడుదల చేయడంతో నదీ ప్రాంతం నీటి ప్రవాహంతో కళకళలాడుతోంది.

బాధితులతో ఆప్యాయంగా మాట్లాడండి

- ఎస్పీ దామోదర్

గజపతినగరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లకు వచ్చే వృద్ధులు, బాధితులు, మహిళలతో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలని సిబ్బందిని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను ప్రభుత్వ నిబంధనల మేరకు డిస్పోజ్ చేయాలని సూచించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుల సమస్యలను ఓపికగా విని... పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని... అందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. నేరాల నియంత్రణకు అవసరమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. గంజాయి విక్రయాలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళలు, బాలలు, సైబర్, రహదారి భద్రత పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గంజాయి స్థావరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ రమణ, ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

మహిళలను ఉన్నత స్థితికి చేర్చడమే లక్ష్యం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు మరింత ఉన్నత స్థితికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అఖిల భారత డ్వాక్రా బజారు (సరస్ ఎగ్జిబిషన్)ను సోమవారం రాత్రి స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో కలెక్టర్ రామసుందర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల స్టాల్స్‌ను తిలకించి... వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక ప్రగతికి పునాది వేసింది సీఎం చంద్రబాబు నాయుడని గుర్తు చేశారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇప్పుడు కృషి చేస్తున్నారని చెప్పారు. జీవనోపాధులు పెంచడం ద్వారా వారిని ఆర్థికంగా వృద్ధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు దోహదపడతాయని చెప్పారు. సుమారు 244 స్టాల్స్‌ను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసినట్టు మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని చెప్పారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు. ఆయన పిలుపు మేరకు మనం తయారు చేసిన వస్తువుల నే వినియోగించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు తరఫున సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున చెప్పారు. అంతకుముందు స్త్రీనిధి ద్వారా 16,034 మంది మహిళా సంఘ సభ్యులకు రూ.145,94,00,000 విలువైన చెక్కును అందించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏపీడీ సావిత్రి, నాబార్డు డీడీఎం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసుస్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 30 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి సమస్యలు స్వీకరించి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడి ఫిర్యాదులను పరిష్కరిచాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 13, కుటుంబ కలహాలకు సంబంధించి 2, నగదు వ్యవహారాలకు సంబంధించి 3, ఇతర అంశాలకు సంబంధించి 12 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని వాటి పూర్వాపరాలు విచారణ చేసి వాస్తవాలు ఉన్నట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రభావతి సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 134 వినతులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 134 వినతులు వచ్చాయి. వీటిని డీఆర్వో శ్రీనివాసమూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు మురళి, నూకరాజు తదితరులు స్వీకరించారు. వీటిని పరిశీలించి, పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులు ఆదేశించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత సమయంలో వినతులు పరిష్కరించాలని సూచించారు. వచ్చిన వినతుల్లో రెవెన్యూకు సంబంధించి 63 వినతులు రాగా, ఇతర శాఖలకు సంబంధించి మిగిలినవి అందాయి.



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉడా సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.త్రినాథ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంతం ఆర్టీసీ కాలనీ, గౌతమినగర్, ఉడా ఫేజ్-1, 2, 3, 4, మహాలక్ష్మీనగర్, ఆదిత్య నగర్, సాలిపేట, గోకపేట, ఆర్‌అండ్‌బీ జంక్షన్, వివేకానంద కాలనీ, ఎల్‌బీ నగర్, బొగ్గుల దిబ్బ, సెయింట్ జోసఫ్ స్కూల్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

సజావుగా యూరియా పంపిణీ

గుర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామంలో సోమవారం యూరియా పంపిణీ కార్యక్రమం సజావుగా సాగింది. తహసీల్దార్ ఆదిలక్ష్మి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. చీపురుపల్లి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చీపురుపల్లి వ్యవసాయశాఖ ఏడీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

గుర్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై ప్రచారం

సంతకవిటి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయని విజయనగరం సౌత్ జీఎస్టీ అధికారులు ఎం.రమేష్, పి.దివాకర్ తెలిపారు. సోమవారం సంతకవిటి మండలంలోని పలు దుకాణాలను పరిశీలించి.. వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వీరితో పాటు ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, ఏపీవో హరినాథ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

రాజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హై సేవా కార్యక్రమంలో 15 రోజుల పాటు అన్ని పంచాయతీల్లో పనిచేసిన 60 మంది పారిశుధ్య కార్మికులను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావులు సన్మానించారు. భద్రాత కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించండి

డెంకాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భోగాపురం సీఐ రామకృష్ణ కోరారు. చింతవలస వద్ద గల ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అందించిన 10 స్టాపర్స్‌ను మండలంలోని వివిధ రహదారుల్లో సోమవారం ఏర్పాటుచేశారు. సీఐతో పాటు ఎస్‌ఐ సన్యాసి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో శతశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని మున్సిపల్ ఆర్డీ రవీంద్ర మున్సిపల్ సిబ్బందికి సూచించారు. సోమవారం రాజాం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామఅప్పలనాయుడు, మేనేజర్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ.. సచివాలయాల వారీగా సమీక్షలు నిర్వహించి లక్ష్యాలను నిర్దేశించాలని సూచించారు. లక్ష్యసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

గోకవలసకు గుర్రం జాషువా పురస్కారం

రాజాం రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు గోకవలస కృష్ణమూర్తికి గుర్రం జాషువా పురస్కారం దక్కింది. ఈనెల 28న విజయవాడలో కౌత పూర్ణానంద కళావేదికలో నిర్వహించిన కార్యక్రమంలో అనంతపురానికి చెందిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన తెలుగు కళారత్నాలు సేవాసంస్థ గోకవలసకు ఈ పురస్కారం అందజేసింది. ప్రసంశాపత్రంతో పాటు నగదు పురస్కారం అందజేసినట్లు కృష్ణమూర్తి స్థానిక విలేకర్లకు తెలిపారు. ఏఎస్పీ డా.జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కనీస ఫెన్షన్ ఇవ్వాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జ్యూట్, రైస్ మిల్లులతో పాటు ప్రైవేటు షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస ఫెన్షన్ రూ.9 వేలు అమలు చేయాలని ఫెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాంలో కార్మిక పెన్షనర్లతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ధరలు ఆకాశాన్నంటుతున్న రోజుల్లో ప్రభుత్వం అందజేస్తున్న ఫెన్షన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బంగార్రాజు

భోగాపురం, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఏఆర్ దామోదర్‌ను రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గానికి సంబంధించి పలు విషయాలపై మాట్లాడారు.

జీతాలు చెల్లించండి

● ఎండీఎం నిర్వాహకుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎండీఎం ఏజెన్సీ సభ్యులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఏజెన్సీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆందోళన చేశారు. కలెక్టరేట్ గేటు ఎదుట ఒక సంఘం నిరసన వ్యక్తం చేయగా, జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద మరో యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలల జీతాలు చెల్లించాలని, గత నాలుగు నెలల కిందట పెరిగిన మెనూ చార్జీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు అరికట్టాలని, ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. యూనిఫాం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి మెస్ చార్జీ రూ.20 చొప్పున అందించాలన్నారు. యూనియన్ నాయకులు, కార్మికులు ఉన్నారు.

నకిలీ వరి విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న రైతులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ వరి విత్తనాలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. రాజాం మండలం గడ్డిముడిదాం గ్రామంలోని ఓ డీలరు 1001 రకం విత్తనాలను విక్రయించారని, ఇప్పుడు ఈ విత్తనాలు వేసుకుంటే వెన్నులు రావడం లేదన్నారు. ఆ డీలర్లపై చర్యలు తీసుకుని ఎకరాకు రూ.40వేలు చొప్పున పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలోని రైతు సంఘ నాయకులు, రైతులు ఉన్నారు.

పెదఖండేపల్లిలో ఉద్రిక్తత

● సర్పంచ్ అరెస్టు.. స్పందించిన హోంమంత్రి


గ్రామస్థులు, పోలీసుల మధ్య వాగ్వాదం

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పెదఖండేపల్లిలో సర్పంచ్ యాళ్ల రమణ అరెస్టుతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గతంలో జిందాల్‌కు కేటాయించిన భూములకు సంబంధించి అప్పట్లో చేసిన గ్రామసభ తీర్మానాలు రద్దు చేయాలని, ప్రభుత్వం ఈ భూముల్లో ఏర్పాటుచేస్తామన్న ఎంఎస్ఎంఈ పార్కులపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు సర్పంచ్ రమణ సిద్ధమయ్యారు. ఈమేరకు సోమవారం గ్రామసభ ఏర్పాటు చేయదలిచారు. అయితే ముందురోజు రాత్రి.. మరునాడు కలెక్టర్ వద్దకు రావాలని ఆదేశాలు వచ్చాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సర్పంచ్‌కు తెలియజేశారు. అయినా సర్పంచ్ గ్రామసభ ఏర్పాటుపై ముందుకు వెళ్లారు. ఈక్రమంలో సోమవారం ఉదయం 10గంటల సమయంలో సీఐ నారాయణమూర్తి తన సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. సర్పంచ్ రమణను పోలీస్ జీపులో స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సోమేశ్వరరావు, పలు పంచాయతీల ప్రజాప్రతినిధులు చేరుకుని పోలీసుల తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే సమయంలో ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ తీర్మానాలకు సిద్ధమయ్యారు.

● తమ సర్పంచ్‌ను పోలీసులు అకారణంగా అరెస్టు చేయడం మీడియాలో రావడంతో హోంమంత్రి అనిత స్పందించారు. ఎమ్మెల్సీ రఘురాజుతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామసభ ఏర్పాటుకు సహకరిస్తామని.. చేస్తున్న తీర్మానాలు ఆపేయాలని ఆమె కోరారు. దీంతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ పోలీసులు ఎంతో అవమానకరమైన రీతిలో సర్పంచ్‌ను అరెస్ట్ చేశారని, అంతే గౌరవంగా గ్రామానికి తీసుకురావాలని కోరారు. ఈ విషయంపై తాను ఎస్పీతో చెప్పి విడుదల చేయిస్తానని హోంమంత్రి చెప్పడంతో ఆయన అంగీకరించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సర్పంచ్‌ను పోలీసులు విడిచిపెట్టారు. ● సర్పంచ్ రమణ అరెస్టుపై ఎంపీపీ సోమేశ్వరరావు విలేకర్లతో మాట్లాడుతుండగా పోలీసులు వచ్చి వీడియోలు తీశారు. దీనిపై ఎంపీపీ అభ్యంతరం తెలిపారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాను ఒక దళిత ఎంపీపీ కావడం వల్లే పోలీసుల తీరు ఇలా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎస్పీకి ఫిర్యాదు చేశాం

తన అరెస్టుపై సర్పంచ్ రమణ మాట్లాడుతూ ప్రజల కోరిక మీద గ్రామసభకు సిద్ధమయ్యామని, ఇంతలో పోలీసులు వచ్చి, తన మెడపై చేయివేసి, పద.. స్టేషన్‌కు అని తీసుకెళ్లడం బాధించిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం దృష్టిలో పెడతామన్నారు. ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు.

సమన్వయంతో పైడిమాంబ జాతర

విజయనగరం టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వివిధ విభాగాల అధికారుల సమన్వయంతో పైడిమాంబ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ వీవీ లక్ష్మి చెప్పారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ భవనంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పది అంశాలను అజెండాలో చర్చించారు. వాటన్నింటిని సభ్యులు ఆమోదించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడిమాంబ పండుగను విజయవంతం చేయడం తోపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందరూ సమష్టి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, జీవీ రంగారావు, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వినతి

వేపాడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ మండలంలోని సచివాలయ ఉద్యోగులు సోమవారం స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. స్వామిత్వ సర్వే నుంచి తప్పించాలని కోరారు.

బాక్సింగ్ పోటీల్లో షికారుగంజి విద్యార్థుల ప్రతిభ

దత్తిరాజేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): షికారుగంజి ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాక్సింగ్ స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల విజయనగరం రాజీవ్ స్టేడియం వేదికగా జరిగిన బాక్సింగ్ స్కూల్ గేమ్స్‌లో అండర్-17 విభాగంలో డి.గిరీష్, అండర్-19 విభాగంలో బి.శృతి ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. వీరు అక్టోబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి వేదికగా జరుగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్.రాజేష్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు ఇతర ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

విజయనగరం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని నగర పాలకసంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. సోమవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో లోక్ కల్యాణ్ మేళాను ఆయన ప్రారంభించారు. దీనికి ముందు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, డిజిటల్ లావాదేవీల ప్రక్రియను పరిశీలించారు. వీధి విక్రయదారులకు గుర్తింపుకార్డులను, ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్పొరేటర్ దుప్పాడ సునీత, బ్యాంకు మేనేజరు మూర్తి, ఫుడ్ సేఫ్టీ అధికారి మీరా తదితరులు పాల్గొన్నారు.

లోక్ కల్యాణ్ మేళాతో బ్యాంకు రుణాలు


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారం చేస్తున్న వారికి లోక్ కల్యాణ్ మేళా ద్వారా బ్యాంకు రుణాలు మంజూరు చేస్తారని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక నటరాజు కల్యాణ మండపంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వీధి వ్యాపారుల్లో అర్హుల ను గుర్తించి, రుణం మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. బ్యాంకుల మేనేజర్లు, ఏఎంసీ చైర్మన్ గురవాన పార్వతి, మెప్మా అధికారి కె.రాజేష్‌కుమార్, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల రిలే దీక్షలు ప్రారంభం


బొడ్డవరలో రిలే దీక్షలో పాల్గొన్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గత వంద రోజులుగా జిందాల్ కంపెనీ నుంచి తమ భూములు వెనక్కి ఇవ్వాలని శాంతియుత పోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు 101వ రోజు సోమవారం నుంచి రిలే దీక్షలు ప్రారంభించారు. బొడ్డవర గ్రామంలో ఎమ్మెల్సీ నివాసంలో బొడ్డవర, కిల్తంపాలెం, పెదఖండేపల్లి, ముషి డిపల్లికి చెందిన నిర్వాసితులు రిలే దీక్షలు ప్రారంభించారు. వంద రోజుల పోరాటం తమలో స్ఫూర్తిని నింపిందన్నారు. ఇక ఎవరికీ విఘాతం కలగని విధంగా గాంధీజీ అహింసా మార్గంలో పోరాటం చేస్తామని ప్రకటించారు.

కష్టాల్లో ఉన్న వారికి అండగా ప్రభుత్వం


భోగాపురం: సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు


చీపురుపల్లి: బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు

భోగాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. సోమవారం పోలిపల్లి గ్రామంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన పరిహార పత్రాలను బాధితులకు అందజేశారు. పూసపాటిరేగ మండలానికి చెందిన ముగ్గురు బాధితులకు రూ.1.95 లక్షలు విలువగల మంజూరు పత్రాలను అందజేశారు. రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ ఎం.సింహాచలం, క్లస్టర్ ఇన్‌చార్జి దంగా భూలోక పాల్గొన్నారు.

● చీపురుపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. మెరకముడిదాం మండలం బుదరాయవలస గ్రామానికి చెందిన రెడ్డి యామిని గత కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతోంది. ఈ మేరకు బాధితురాలి తండ్రి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.8లక్షలు మంజూరయ్యింది. కాగా, చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామ్‌మల్లిక్‌నాయుడు చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, గేడే సన్యాసప్పలనాయుడు పాల్గొన్నారు.

● చీపురుపల్లిలోని తాగునీటి సరఫరా పథకాన్ని రామ్‌మల్లిక్‌నాయుడు పరిశీలించారు. ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎంపీడీవో ఐ.సురేష్‌కు సూచించారు. మోటార్ల మరమ్మతులకు అవసరమైన రూ.3లక్షలను త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

గో విజ్ఞాన పరీక్షల్లో బొద్దూరు విద్యార్థుల ప్రతిభ

సంతకవిటి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విజయనగరంలో గోసేవ విభాగం జిల్లా స్థాయిలో నిర్వహించిన గో-విజ్ఞాన పరీక్షల్లో బొద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ విభాగం.. ద్వితీయ స్థానంలో జశ్వంత్, వాసుదేవరావు, జ్యోతి, తృతీయ స్థానంలో లిఖిత; జూనియర్ విభాగం.. ద్వితీయ స్థానంలో లోహిత్, మణి నిలిచారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1500, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1000 బహుమతిగా అందజేశారు. ఈసందర్భంగా బొద్దూరు జడ్పీ పాఠశాల ఆవరణలో సోమవారం కార్యక్రమం ఏర్పాటు చేసి, విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు కృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో బొద్దూరు ఎంపీటీసీ సభ్యుడు వల్లూరు గణేష్‌తో పాటు పీఏసీఎస్ చైర్మన్ చెలికాని మహేష్ కుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ చిరంజీవినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 సెంట్ల భూమి కలిగిన రైతులు సభ్యత్వం పొందొచ్చు

కొత్తవలస, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కనీసం 10 సెంట్ల వ్యవసాయ భూమి కలిగిన ప్రతిరైతూ రూ.400 సభ్యత్వ రుసుం చెల్లించి సభ్యుడిగా పేరు నమోదు చేసుకోవచ్చునని కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ తెలిపారు. సోమవారం కొత్తవలసలోని కార్యాలయంలో పీఏసీఎస్ కమిటీ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. పీఏసీఎస్‌లో సభ్యులు చేరడానికి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక ఎకరా వ్యవసాయ భూమి కలిగిన రైతు 12 శాతం వడ్డీపై రూ.5లక్షలు రుణసాయం పొందే వీలుందన్నారు. కొత్తవలస పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ నిధులను సమకూర్చాలని కోరుతూ తీర్మానం చేశారు. డైరక్టర్లు గొంప పోతినాయుడు, బి.సూర్యనారాయణ, సీఈవో చైతన్య పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. రేషన్ బియ్యం తరలించేదెలా?

● బురదమయంగా పౌర సరఫరాల గోడౌన్ పరిసరాలు


ఇదీ పౌర సరఫరాల గొడౌన్ దుస్థితి

రాజాం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వర్షం పడిందంటే బొబ్బిలి రోడ్డులో ఉన్న పౌర సరఫరాల సంస్థ గొడౌన్ పరిసరాలు చిత్తడిగా తయారవుతున్నాయి. అడుగు పెట్టేందుకు కూడా అవకాశం లేని విధంగా బంకమట్టితో బురదగా మారిపోతుందని సిబ్బంది, డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాక్టర్‌తో స్టాకు లోడ్ చేసుకుని మెయిన్ రోడ్డుకు రావడం చాలా ప్రమాదకరంగా ఉందని డ్రైవర్లు వాపోతున్నారు. ఈ సమస్య గొడౌన్ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఉన్నప్పటికీ జిల్లా అధికారులు దృష్టిపెట్టిన పరిస్థితి లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయసు సుమారు 30 ఏళ్ల లోపు ఉంటుందని జీఆర్పీ హెచ్‌సీ బండారు ఈశ్వరరావు తెలిపారు. ఎరుపు రంగు గళ్ల ఫుల్ హేండ్స్ షర్ట్, బ్రౌన్ కలర్ అండర్ వేర్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారాన్ని 8309901038, రైల్వే ఎస్ఐ వి.బాలజీరావు 9490617089 నెంబరుకు అందజేయాలని కోరారు.

తండ్రి హత్య కేసులో వ్యక్తి అరెస్టు

బొండపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకిండాం గ్రామంలో ఈనెల 23వ తేదీ రాత్రి తన తండ్రిని హత్య చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ స్థానిక విలేకర్లకు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండకిండాం గ్రామానికి చెందిన పెద్దమజ్జి నాయుడుబాబుకు, తన ఏకైక కొడుకు పెదమజ్జి గణేష్‌కుమార్‌కు మధ్య గత కొంతకాలంగా ఆస్తి వివాదాలు నడుస్తున్నాయి. ఈక్రమంలో 23వ తేదీ రాత్రి ఆస్తి విషయమై తండ్రి, కొడుకుల మధ్యన ఘర్షణ జరిగింది. గణేష్‌కుమార్ క్షణికావేశంలో తన తండ్రి నాయుడుబాబుపై ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. దీంతో నాయుడుబాబు మృతిచెందాడు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించి గణేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశారు.

గంజాయి స్వాధీనం

బొండపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయితో ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని, వారికి గంజాయిని సరఫరా చేసిన మరో ముగ్గురిని పట్టుకుని, అరెస్టు చేశామని ఎస్ఐ యు.మహేష్ సోమవారం తెలిపారు. దీనిపై ఎస్ఐ స్థానిక విలేకర్లకు వివరాలు వెల్లడించారు. సాలూరు మండలం సోంపిగాం గ్రామానికి చెందిన నీదరపు రామారావు, అదే మండలంలోని సామంతులవలస గ్రామానికి చెందిన మల్లి నాగరాజు స్థానిక గొట్లాం బైపాస్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పందంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న రెండు కిలోల గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అలాగే వీరికి అమ్మకానికి సహకరించిన విజయనగరానికి చెందిన షేక్ మౌళాలి, వినుకొండ విజయ్‌కుమార్, బారా సాయిలను కూడా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ చెప్పారు. వారి నుంచి బైకుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొట్లాట కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

గజపతినగరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కొట్లాట కేసులో జె.భగవాన్ అనే వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ సోమవారం తీర్పు వెల్లడించారు. మెంటాడ మండలం పోరాం గ్రామ రెవెన్యూకు చెందిన మామిడి తోటలో 2023లో అదే గ్రామానికి చెందిన తిరుమలరాజు జగన్నాథరాజు అనే వ్యక్తిని భగవాన్ వెదురుకర్రతో తలపై కొట్టి అతని వద్ద నుంచి రూ.10వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుకు వెళ్లిపోయాడు. ఈ కేసుకు సంబంధించి న్యాయాధికారి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేల అపరాధ రుసుం విధించారు.

తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం


నుజ్జయిన కారు


బోల్తా పడిన లారీ

భోగాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై సీఐ కె.దుర్గాప్రసాద్‌రావు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఓ సెప్టిక్‌ట్యాంకు లారీ శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు జాతీయ రహదారిపై వెళ్తోంది. అలాగే శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ఓ కుటుంబం కారుపై విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తోంది. అయితే భోగాపురం జాతీయ రహదారిపైకి వచ్చేసరికి కారు అదుపు తప్పి బోల్తాపడి డివైడర్‌ను దాటి అవతల వైపు రోడ్డుపైకి వెళ్లిపడింది. అవతలి రహదారిలో వస్తున్న సెప్టింక్ ట్యాంకు లారీ కారును తప్పించబోయి బోల్తాపడింది. దీంతో లారీ ఉన్న తునికి చెందిన డ్రైవర్ నల్లగుడ్ల శివయ్య, క్లీనర్ జగన్నాథప్రసాదులకు గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జు కాగా, కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాకుండా బయట పడ్డారు. ఎస్ఐ పాపారావు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వాహనాలను తొలగింపజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తునికి చెందిన లారీ డ్రైవర్ శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్ ఖాతా నుంచి రూ.2.9లక్షలు మాయం

భోగాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కవులవాడ మాజీ సర్పంచ్ కొండపు రమణ తన అకౌంట్ నుంచి రూ.2.9లక్షలు పోగొట్టుకున్నట్లు సోమవారం తెలిపారు. తన సిమ్ ఈనెల 15 నుంచి పనిచేయడం లేదని, అయితే ఈనెల 22న తన సెల్‌ఫోన్‌లో కొత్త సిమ్ వేశానని చెప్పారు. అయితే ఈనెల 22, 23, 24 తేదీల్లో దఫదఫాలుగా రూ.2.9 లక్షలు తన ఖాతా నుంచి పోయినట్లు ఈనెల 28న పరిశీలించానని చెప్పారు. అయితే ఫోన్‌పే మినహాయించి ఏ యాప్ ఉపయోగించడంలేదని.. యూపీఐ నుంచి నగదు పోయినట్లు ఉందని ఆయన వాపోయారు.

న్యాయవాదుల కుటుంబాలకు భరోసా

కొత్తవలస, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తూ మృతి చెందితే ఇకపై ఆ కుటుంబానికి ఇప్పటి వరకు ఇస్తున్న రూ.6లక్షలను రూ.9 లక్షలకు పెంచారని కొత్తవలస న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. ఆమె సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ఇటీవల జరిగిన రాష్ట్ర బార్ కౌన్సిల్ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ఈ మొత్తం సొమ్ము న్యాయవాదుల సంక్షేమ సంఘం నుంచి అందుతూ ఉందన్నారు. అక్టోబరు 1 నుంచి కొత్తపాలసీ అమలులోకి వస్తుందని చెప్పారు. న్యాయవాదులు, వారి భాగస్వాములకు వైద్య సాయం కింద ఇప్పుడు ఇస్తున్న రూ.లక్షా 50వేలను రూ.2 లక్షల 50 వేలకు పెంచారని తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం న్యాయవాదులకు కొంత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

దత్తికి సీఎం రావడం ఆనందదాయకం

(ఐదో పేజీ తరువాయి)

భాగంగా ముఖ్యమంత్రి ఇక్కడ పెన్షన్ పంపిణీ చేయనున్నారని తెలిపారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సార్వగడ్డ రిజర్వాయర్ గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్న తోటపల్లి కాలువ పనులను త్వరలో పూర్తిచేసే అవకాశం ఉందన్నారు. మంత్రి వెంట జేసీ సేతుమాధవన్, అదనపు ఎస్పీ సౌమ్యలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, క్లష్టర్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యం

(ఐదో పేజీ తరువాయి)

రేగిడి, వంగరలో క్రషర్లు నడుస్తున్నాయి. వీటిలో చాలాచోట్ల అనధికారిక పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారు. సాధారణంగా పేలుడు సామగ్రి వినియోగించాలంటే పెట్రోలియం అండ్ పేలుడు పదార్థాల భద్రత సంస్థ (పెసో) అనుమతితో కూడిన లైసెన్స్ ఉండాలి. భద్రతా ప్రమాణాల దృష్ట్యా సాధారణంగా మంజూరు చేయరు. అంత సులువుగా లైసెన్స్ ఇవ్వరు. ప్రస్తుతం జిల్లాలో ఓ రెండు సంస్థలకు మాత్రమే అనుమతులు న్నాయి. అయితే క్వారీలు ఎక్కువగా నడుస్తున్న ప్రాంతాల్లో అనధికారికంగా విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఒడిశా, చత్తీస్‌గఢ్‌లో వీటి ధర తక్కువగా ఉండడంతో అక్కడ నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే నిబంధనలు పట్టకుండా తెస్తున్న పేలుడు పదార్థాలతో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు మూల్యం చెల్లించుకుంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా..

గత ఐదు సంవత్సరాల్లో జిల్లాలో వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న క్వారీ ప్రమాదాల్లో చాలా మంది కార్మికులు మృతిచెందారు. మరెందరో క్షతగాత్రులయ్యారు. అయినా సరే యంత్రాంగంలో కనీస చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిలెటిన్ స్టిక్స్ వంటి పేలుడు పదార్థాలు వినియోగించాలంటే క్వారీ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్, గనులు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అనుమతులు పొందాలి. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించాలి. అటు తరువాత లైసెన్స్‌దారుడు నుంచి మాత్రమే పేలుడు పదార్థాలు కొనుగోలు చేయాలి. నిపుణుల సమక్షంలో వాటిని పేల్చాల్సి ఉంటుంది. అదే సమయంలో క్వారీలో పనిచేస్తున్న కార్మికుల భద్రతను చూడాలి. వారికి లైఫ్ జాకెట్‌తో పాటు రక్షణ సామగ్రి అందించాలి. కానీ జిల్లాలో ఇవి ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగానే క్వారీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రత్యేకంగా దృష్టి పెట్టాం

జిల్లాలో క్వారీల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. ముఖ్యంగా పేలుడు పదార్థాల వినియోగానికి అనుతులు తప్పనిసరి. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని క్వారీల్లో తనిఖీలు జరుగుతున్నాయి. ఇకపై నిత్య పర్యవేక్షణ, తనిఖీలు ఉంటాయి. ఎక్కడైనా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే క్వారీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తాం.

- హెచ్.ఉపేంద్ర, సీఐ, రాజాం

బీమాతో ధీమా

(ఐదో పేజీ తరువాయి)

మెచ్యూరిటీని 35, 40, 45, 50, 55, 58, 60 ఏళ్లలో ఏదో ఒక ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. మెచ్యూరిటీ ఏ సంవత్సరం వరకు అయితే నిర్ణయించుకుంటారో ఆ సంవత్సరం నుంచి మరో ఐదేళ్లపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. అనంతరం పాలసీ మొత్తానికి బోనస్ జోడించి లబ్ధిదారుడికి అందజేస్తారు. రూ.10లక్షలు పాలసీ చేసిన లబ్ధిదారుడికి బోనస్‌తో కలిపి మొత్తం రూ.29.68 లక్షలు అందుతుంది.

సురక్ష పథకం ఇలా..

సురక్ష పథకం కింద రూ.10వేలు నుంచి రూ.10లక్షల వరకు పాలసీ నిర్ణయించారు. బోనస్ కింద రూ.1000కి రూ.60వర్తిస్తుంది. వయసు 60 సంవత్సరాలు వచ్చే వరకు ప్రీమియం చెల్లించాలి. రూ.10లక్షల పాలసీదారు 60వ సంవత్సరం వరకు చెల్లిస్తే బోనస్‌తో కలిపి దాదాపు రూ.34.60లక్షలు అందజేస్తారు. పాలసీ ప్రారంభించాక మూడేళ్ల తరువాత నుంచి పాలసీదారుడుకి రుణ సదుపాయం కూడా ఉంటుంది.

గ్రామప్రియ పాలసీ ఇలా..

ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీ మాత్రమే నిర్ణయించారు. ఇందులో 20నుంచి 40 సంవత్సరాల వయసు వారిని అర్హులుగా చేర్చారు. 10 సంవత్సరాల తర్వాత పాలసీలో మనీబ్యాక్ కింద నిర్దేశించిన సమయంలో 20శాతం బోనస్ లభిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పాలసీ ముగిసే సమయంలో బోనస్‌ను జోడించి అందించనున్నారు.

సువిధ పథకం ఇలా..

సువిధ పథకం కింద రూ.10 వేలనుంచి రూ.10లక్షల వరకు పాలసీ నిర్ణయించారు. 19నుంచి 45సంవత్సరాల మధ్య వయస్కులు అర్హులు. ఈ పాలసీని 60 సంవత్సరాల వయసు వచ్చే వరకు తీసుకోవచ్చు. లేదంటే కన్వర్ట్ చేసుకొనే అవకాశం కూడా కల్పించారు. సువిధ పథకం కింద ప్రీమియం చెల్లింపులు ఐదేళ్లపాటు చేయాలి. ప్రీమియం బట్టి బోనస్ ఉంటుంది.

సుమంగళ్ పాలసీ ఇలా..

ఈ పాలసీకి 19నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్కులు అర్హులు. ఈ పథకంలో రెండురకాల బోనస్‌ను నిర్ణయించారు. 15సంవత్సరాల పాలసీని ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద వరుసగా 6, 9, 12 సంవత్సరాలు అయినప్పుడు బోనస్ లభించనుంది. అలాగే వరుసగా 8, 12, 16 అయినప్పుడు 20శాతం చొప్పున మనీబ్యాక్ రూపంలో బోనస్ లభిస్తుంది. ఈపథకంలోఎలాంటి రుణసదుపాయం ఉండదు.

పిల్లల పాలసీ ఇలా..

ఈపాలసీలో చేరే పిల్లాడికి సంబంధించి తల్లిదండ్రులు సురక్ష, సువిధ పథకాల్లో లబ్ధిదారులై ఉండాలి. అది కూడా తల్లిదండ్రుల వయసు 45ఏళ్ల లోపు ఉండాలి. 5నుంచి 20ఏళ్లలోపు ఉన్నపిల్లలకు ఈ పాలసీ వర్తిస్తుంది. ఈ పథకంలో రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు పాలసీ ప్రీమియాన్ని నిర్ణయించారు.

కొత్త పాలసీలపై అవగాహన కల్పిస్తున్నాం

పోస్టల్ శాఖలో అమలు చేస్తున్న కొత్త పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ఇటీవల మెగా క్యాంపులు నిర్వహించి సబ్ డివిజన్ పరిధిలో అనేక పాలసీలు చేశారు. గతంలో పాలసీలు కట్టే లబ్ధిదారుడిపై జీఎస్టీ ప్రభావం ఉండేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎటువంటి జీఎస్టీ లేకుండా లబ్ధిదారులు పాలసీ తీసుకోవచ్చు.

- బి.ఉపేంద్ర, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, గజపతినగరం సబ్ డివిజన్

ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

బెలగాం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా 5 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కా రానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ సుధాకర్, ఎస్ఐ ప్రకృద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇళ్ల కొలతలు వేస్తారా?

● మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యుల ఆగ్రహం

బొబ్బిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతి, ముందస్తు సమాచారం లేకుండా ఇళ్లకు కొలతలు వేయడమేంటి? సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, ఆరో వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గెంబలి మాట్లాడారు. ఇళ్లకు వచ్చి కొలతలు తీస్తున్న వ్యక్తులు ఎవరు? వారిని ఎవరు ఎందుకు పురమాయించారు? అధికారుల అనుమతితోనే వస్తున్నారా? అని అధికారులను నిలదీశారు. దీనిపై కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలో 14 వేల భవనాలకు సంబంధించిన అసెస్‌మెంట్లు ఉన్నాయన్నారు. వాటి నుంచి వసూలు చేస్తున్న ఆస్తి పన్ను, ఆన్‌లైన్‌లో గణాంకాలను సరిచూడాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందు కోసం ఇళ్లు, భవనాల పరిమాణాల కొలతలు తీస్తామన్నారు. ఇంతవరకు బయట వ్యక్తులు ఎవరికీ బాధ్యత అప్పగించలేదన్నారు. సచివాలయం ఉద్యోగులు వచ్చి కొలతలు తీస్తారని, వారు ఐడీ కార్డులతో వస్తారని బదులిచ్చారు. ఒకటో వార్డు కౌన్సిలరు చోడిగంజి రమేష్‌నాయుడు మాట్లాడుతూ పాతబొబ్బిలిలో గ్రామకంఠం రికార్డులను వెల్లడించాలన్నారు. సాంకేతికంగా కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో గ్రామకంఠం ఎంత ఉందనేది తెలియాలన్నారు. తహసీల్దారు ద్వారా పొజిషన్ సర్టిఫికెట్ పొందిన తరువాత దానిపై అసెస్‌మెంట్ నెంబరు వస్తుందన్నారు. సంగివీధిలో మూతపడ్డ బాపూజీ మున్సిపల్ స్కూల్ భవనాన్ని అంబేద్కర్ భవన్ కోసం కేటాయించాలని ఆ వార్డు కౌన్సిలరు బొత్స సురేష్ కోరారు. పదవి కోల్పోయిన మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాకుండా సంతకాలు చేసేందుకు ఎలా సమ్మతిస్తున్నారని గొల్లపల్లి కౌన్సిలర్ సావు శారద ప్రశ్నించారు. దీనికి చైర్మన్ శరత్‌బాబు వివరణ ఇచ్చారు. వరుసగా మూడు సమావేశాలకు హాజరు కాకపోతే నోటీసు జారీ చేస్తామని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. అనధికార కుళాయి కనెక్షన్లను రెగ్యులరైజ్ చేయాలని ఇంటి గోవిందరావు, చోడిగంజి, వెలగాడ హైమావతి, గొలగాని రమాదేవి కోరారు. ఇందుకోసం నాలుగేళ్ల కిందట నోటీసులు జారీ చేసి మిన్నకుండిపోయారని గెంబలి ఆరోపించారు. చోడిగంజి మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల మెయిన్ లైన్ నుంచి నేరుగా కుళాయి లైన్లు వేసేశారని, వాటన్నింటినీ తొలగించి సబ్ లైన్స్ ద్వారా ఇవ్వాలని కోరారు. తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని హైమావతి, తెంటు పార్వతి కోరారు. రెండు, మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. గడప గడపకు పథకంలో మంజూరైన పనులు చేపట్టరా అని బొత్స సురేష్ అధికారులను అడిగారు. సమావేశంలో ఏఈలు గుప్త, కోటేశ్వరరావు, ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, టీపీఆర్వో జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

అప్రమత్తతతో గుండె జబ్బుల నివారణ



యూపీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతో గుండె జబ్బుల నుంచి సకాలంలో బయటపడవచ్చని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అభినయ్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అభినయ్ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు ఎలా సంక్రమిస్తాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో కూడిన జీవన శైలి, ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం అవసరమన్నారు. మానసిక ఒత్తిడికి గురికాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం తప్పనిసరి అన్నారు. ఊబకాయం, మధు మేహం, రక్తపోటు వంటి వాటి నుంచి రక్షణ పొందేలా వ్యవహ రించాలన్నారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో సిసింద్రీ శ్రీనివాసన్, రామకృష్ణ, చిన్నారావు, సోమేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మహిళల ఆరోగ్యం

రామభద్రపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం పౌష్టికాహారంతోనే సాధ్యమని ఐసీడీఎస్ పీవో వరహాలమ్మ తెలిపారు. కొట్టక్కిలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సోమవారం సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబంలో ఉన్న మహిళ ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబం అంతా బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనూరాధ, రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా కారాడ రోడ్డు



గోతులతో కారాడ రోడ్డు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అలజంగి నుంచి కారాడ వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డు మొత్తం గోతులతో నిండింది. ఇటీవల కురిసిన వర్షాలకు అందులో నీరు చేరడంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయపడుతున్నారు. ఈ రహదారి బొబ్బిలి నుంచి రాజాం ప్రధాన రహదారి అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కనీస మరమ్మతులు చేపట్టడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

నామమాత్రంగా మున్సిపల్ సమావేశం



మున్సిపల్ సర్వసభ్య సమావేశం దృశ్యం

సాలూరు, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అజెండాలోని అంశాలను అధికారులు సభ్యులకు చదివి వినిపించారు. దాంతో అజెండాలోని అన్ని అంశాలపైన సభ్యుల ఆమోదం తెలిపారు. అనంతరం నిర్వహించిన జీరో అవర్‌లో మున్సిపల్ కౌన్సిలర్లు రాపాక మాధవ, గిరి రఘు, సింగారపు ఈశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలోని వలంటీరు వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు చేకూరేదన్నారు. ప్రస్తుతం ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీడీసీ స్థలం ఏమైంది?

బొబ్బిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 1995 లో అప్పటి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సీడీసీ భవనం నిర్మాణం కోసం శంకుస్థాన చేశారని ఇప్పుడు ఆ స్థలం ఏమైందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు ప్రశ్నించారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీడీసీ భవనం నిర్మించకుండా ఎందుకు నిలుపుదల చేశారని నిలదీశారు. ఆ స్థలం ఎవరి ఆధీనంలో ఉందన్న విషయాన్ని అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు. అక్కడ జీవనోపాధి కోసం చిన్నపాటి దుకాణాలు పెట్టుకున్న వారిని తొలగించాలని వారు ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు ఎ.అప్పారావు, వెంకటరావు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం విజయనగరం జిల్లా సీనియర్ మెన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ జట్టు ఎంపిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు అందులో 20 మందిని కోచింగ్‌కు ఎంపికయ్యారు. ఇందులో 16 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో సత్తెనపల్లిలో జరగనున్న పోటీలకు క్రీడాకారులను పంపిస్తామని జిల్లా క్రీడా విభాగం కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సత్యనారాయణ, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో దుర్గమ్మకు పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

రామభద్రపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయినగర్‌లో దుర్గామాతకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి బాదంపూడి విశ్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు విద్యాసాగర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాల యంలో ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 23 వినతులు అందాయి. సవర భాష వలంటీర్ పోస్టు ఇప్పించాలని తాడిపాయి గ్రామానికి చెందిన బిడ్డిక నందిని కోరారు. ట్రాక్టర్ రుణం మంజూరు చేయాలని సుందరయ్యగూడకు చెందిన పూయిక సుదర్శనరావు వినతి పత్రం అందజేశారు. కొత్తకోటలో అంగన్ వాడీ నూతన భవనం నిర్మించాలని మూటక మహేష్ కోరారు. మినీ గోకులం షెడ్డులో సౌకర్యాలు కల్పించాలని బి.నీలకంఠం, సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని సవర సునీత, ఆశా వర్కర్ పోస్టు కోసం కూరంగి శాంతి వినతిపత్రాలు అందజేశారు. పీజీఆర్ ఎస్‌లో ఏపీవోతో పాటు టిడబ్ల్యూ ఈఈ రమాదేవి, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, పీఆర్ ఈఈ రాధా రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతీ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ లక్ష్యం

సీతంపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సీతంపేటలో సోమవారం అన్నా క్యాంటీన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంపేటలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చమన్నారు. ఆ హామీ మేరకు ఇక్కడ నిర్మించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నిబ్రం, పవన్, హెచ్.ప్రసాద్, మండంగి విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థల సేకరణ చేపట్టండి

పాలకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్య పరిష్కారానికి తక్షణమే స్థల సేకరణ చేపట్టాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కమిషనర్ రత్నంరాజుకు ఆదేశించారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్యాలయంలో దుర్వాసన రావడంపై అసహనం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డుకు స్థల సేకరణ చేయాలని చెబుతున్నా తాత్సారం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, గంటా సంతోష్‌కుమార్ ఉన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

● బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో పాడైన కుళాయిలు



లీకవుతున్న కుళాయి.. నాచు పట్టిన కుళాయి ప్రాంతం

బొబ్బిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో మూడో లైన్ ప్లాట్‌ఫామ్‌పై ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు మూడు రోజులు కాకమునుపే పాడయ్యాయి. ఇటీవల బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లను కొత్తగా నిర్మించారు. ప్రయాణికుల తాగునీటి అవసరాల కోసం కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే కుళాయిల నుంచి అప్పుడే నీరు లీక్ అవుతోంది. తాగునీరు వృథాను అరికడదామని కొందరు ప్రయాణికులు యత్నించినా ఫలితం లేకపోయింది. ట్యాప్ పూర్తిగా ఊడిపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. కుళాయిలు ఏర్పాటు చేసిన ప్రాంతం కూడా నాచు పట్టేసింది. దీంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. రాయగడ-విశాఖపట్టణం రైల్వే లైన్‌లో గల బొబ్బిలి, డొంకినవలస, సీతానగరం, పార్వతీపురం మార్గంలో మూడో రైల్వే ట్రాక్‌ను ఇటీవల సంబంధిత ఉన్నతాధికారులు అట్టహాసంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. మూడు రోజులు గడవక మునుపే ప్లాట్‌ఫామ్‌పై కుళాయిలు పాడైపోవడం గమనార్హం. ప్లాట్‌ఫామ్ పొడవున షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బొబ్బిలి రైల్వే స్టేషన్ నుంచి రోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో అన్ని సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆ భూములు గిరిజనులకు పంపిణీ చేయండి

బొబ్బిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాడంగి మండలం డొంకినవలస దగ్గర భూములను దళిత గిరిజన పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల నుంచి కారుచౌకగా 40 ఏళ్ల క్రితం కోల్‌కతాకు చెందిన వ్యాపారి భూములను కొనుగోలు చేశారన్నారు. జూట్ మిల్లు ఏర్పాటు చేస్తామని వారు అప్పట్లో చెప్పారన్నారు. అయితే ఆ భూములు అప్పటి నుంచి ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ భూములను కొంతమంది సొంతం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ బిల్లులు ఎలా చెల్లిస్తాం?

పాచిపెంట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వీధిదీపాల నిర్వహణ బకాయిలు పేరిట వేలాది రూపాయలు చెల్లించమని పంచాయతీలకు నోటీసులు ఇస్తే మేమెలా చెల్లిస్తామని అధికారులను సర్పంచ్‌లు నిలదీశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గత పాలక మండలి హయాంలోని వీధి దీపాల బిల్లులను మేము ఎలా చెల్లించగలమని పణుకువలస, సతాభి పంచాయతీల సర్పంచ్‌లు సీహెచ్ రామకృష్ణ, శిల్పజన్ని రామయ్య తదితరులు ప్రశ్నించారు. చిన్న పంచాయతీలకు కూడా రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించమని నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో లింకు రోడ్లు బాగా అధ్వానంగా రాళ్లు తేలి ఉన్నాయని, ప్రయాణం నరకంగా ఉందని తంగ్లాం సర్పంచ్ పోయి సుందరమ్మ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని పాచిపెంట ఎంపీటీసీ సభ్యుడు దండి కొండలరావు తదితరులు కోరారు. సమావేశంలో ఎంపీడీవో బి.వి.జె.పాత్రో తదితరులు పాల్గొన్నారు.